క్లుప్తంగా

రేపటి నుంచి గ్రంథాలయంలో పోటీలు



మార్కాపురం టౌన్: వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చేతిరాత, చదరంగంపై శిక్షణ ఇవ్వడంతోపాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి తెలిపారు. ఈనెల 3న చిత్రలేఖనం, 4న చేతిరాత, 5న వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని, విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

రేషన్ దుకాణాల్లోనే సరుకులు

- సబ్ కలెక్టర్ త్రివినాగ్



సరుకులు అందిస్తున్న సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే

మార్కాపురం: ఈనెల నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ సూచించారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని రేషన్ దుకాణాల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితో కలిసి నిత్యావసర వస్తువుల పంపిణీని ప్రారంభించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో సరుకులు ఇస్తారని తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్ద సరుకులు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ చిరంజీవి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

గిద్దలూరు రూరల్: ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన మునుగొండ్ల వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి కొనియాడారు. పట్టణంలోని రాచర్ల రోడ్డులో రిషిత అపార్ట్‌మెంట్‌లో ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.ఓబులరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలుగుళ్ల నరసింహారెడ్డి, వెంకటరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



తాగునీటిలో వచ్చిన పాచి, దోమల లార్వాలు

రాచర్ల: మండలంలోని అనుమలవీడు గ్రామంలో పైలట్ ప్రాజెక్టు వాటర్ ట్యాంకు శుభ్రం చేయకపోవడంతో తాగునీటిలో పాచితో పాటు దోమల లార్వాలు వస్తున్నాయి. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఎస్సీ కాలనీ ప్రజలు కలుషితమైన నీటికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటర్ ట్యాంకును శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హైవే రోడ్డే పూలపాన్పు!



బేస్తవారిపేటలో మత్తులో రోడ్డుపై దొర్లుతున్న మందుబాబు

బేస్తవారిపేట: మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు బేస్తవారిపేట బస్టాండ్‌లో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఒళ్లు తెలియకుండా పడి దొర్లుతున్నారు. రూ.99కే క్వార్టర్ మద్యం లభించడంతో అతిగా తాగేస్తున్నారు. హైవేపై పడిపోతున్న మందుబాబులను స్థానికులు గమనించి వాహనాలు తిరగని ప్రదేశంలో పడుకోబెడుతున్నారు.

ఆ రోజులు మళ్లొచ్చాయ్..

రేషన్.. కష్టాల సైరన్

- ఎండీయూ వాహనాలు రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- రేషన్ షాపుల్లో తొలిరోజే మొరాయించిన సర్వర్
- కార్డుదారులకు తప్పని మోతబరువు
- వృద్ధులు, దివ్యాంగులకు అందని డోర్ డెలివరీ
- కిలోమీటర్ల కొద్దీ వెళ్లి బియ్యం తెచ్చుకోలేక తిప్పలు
- పట్టణ ప్రాంతాల్లో ఎక్కడ షాపులున్నాయో అర్థంకాని పరిస్థితి
- నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలకు అధికారుల వెనకడుగు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సాక్షి నెట్‌వర్క్:

వైఎస్సార్ సీపీ హయాంలో తీసుకొచ్చిన ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యవస్థను టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గత నెల వరకు తమ ఇంటి ముందే ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకులు తీసుకున్న కార్డుదారులు.. ప్రస్తుతం కిలోమీటర్ల కొద్దీ నడిచి, తలపై బియ్యం మూటలతో భారంగా అడుగులు వేయాల్సిన దుస్థితి. కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఆదివారం రేషన్ దుకాణాలు ప్రారంభం కాగా తొలిరోజే సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం చెప్పినా ఎక్కడ తమకు ఎగ్గొడతారోనన్న భయంతో ఊతకర్రలు చేతబట్టుకుని దుకాణాల వద్ద క్యూకట్టారు. రేషన్ దుకాణాల వద్ద డీలర్లు, అధికారుల హడావుడి తప్ప వినియోగదారుల నుంచి స్పందన కరువైంది. పనులు పోగొట్టుకుని రేషన్ షాపుల వద్ద క్యూలో ఉండాల్సిన పరిస్థితి రావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

బియ్యం కావాలంటే కాళ్లకు పనిచెప్పాల్సిందే..

పొదిలి రూరల్ మండలంలో కొండాయపాలెం రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే సలకనూతల ఎస్సీ కాలనీవాసులు 2 కి.మీ కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. మూగచింతలలో రేషన్ పొందాలంటే బట్టువారిపల్లెవాసులు 2 కి.మీ నడవాలి. కంభాలపాడులో రేషన్ తీసుకునేందుకు జాఫ్లాపురం కాలనీవాసులు 2 కి.మీ, గొల్లపల్లిలో రేషన్ తెచ్చుకోవాలంటే కాశీపురంవాసులు 5 కి.మీ, పాములపాడు వాసులు 2 కి.మీ, చిదంబరంపల్లి వాసులు కిలోమీటరు మేర నడవాలి. ఆముదాలపల్లి రేషన్ దుకాణం వద్దకు చేరాలంటే చల్లావారిపాలెం, నిమ్మవరం కార్డుదారులు 2 కి.మీ, మల్లవరంలో రేషన్ తీసుకోవాలంటే కొస్టాలపల్లి గ్రామస్తులు, తలమళ్లలో సరుకులు తీసుకోవాలంటే ఫిర్‌దౌసి నగర్ వాసులు కిలోమీటర్లు దూరం నడవాల్సిందే.

కంభం మండలంలో 31 రేషన్ షాపులుండగా 12838 రేషన్ కార్డులున్నాయి. వీరిలో 1504 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే సరుకులు అందించాల్సి ఉంది. డీలర్లు ఇంటి వద్ద బియ్యం ఇవ్వరనే బెంగ వారిని వెంటాడుతోంది. కాగా ఔరంగబాద్, తెల్లదిన్నె, నడింపల్లి గ్రామాల వారు 2 కి.మీ దూరంలో ఉన్న ఎల్.కోటకు వెళ్లి రేషన్ తీసుకోవాల్సి వస్తోంది, చిన్ననల్ల కాల్వ వాసులు 2 కి.మీ దూరంలో ఉన్న యర్రబాలెంలో, హజరత్‌గూడెం ఎస్సీ కాలనీ వాసులు 2 కి.మీ దూరంలో ఉన్న రావిపాడులో సరుకులు తీసుకోలేక తిప్పలు పడ్డారు. మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో రేషన్ షాపులను కార్డుదారులకు అందుబాటులో కాకుండా దూర ప్రాంతంలో ఏర్పాటు చేశారు.

కొమరోలు మండలంలోని గుంతపల్లె నుంచి బెడుసుపల్లెలోని 14వ నంబర్ రేషన్ దుకాణానికి వెళ్లలేక కార్డుదారులు అవస్థలు పడుతున్నారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో 78 మంది కార్డుదారులు ప్రైవేట్ వాహనాల్లో ఘాట్ రోడ్డులో గుండా ప్రయాణించి సరుకులు తీసుకోవాల్సి వస్తోంది.



కంభంలో సర్వర్ పనిచేయక పోవడంతో కార్డుదారుల తిప్పలు

సర్వర్ సమస్యతో నిరీక్షణ

రేషన్ దుకాణాలు ప్రారంభించిన కాసేపటికే సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు గంటల తరబడి వేచిచూడలేక తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నడిచి వెళ్లి సరుకులు తీసుకోవడానికి కార్డుదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొదటి రోజు అరకొరగా వచ్చినవారికే చుక్కలు కనిపించాయి. ఎండీయూ వ్యవస్థను రద్దు చేసి తమను ఇబ్బందులపాలు చేశారని మహిళలు శాపనార్థాలు పెట్టారు. బేస్తవారిపేట మండలంలోని పాపాయిపల్లె నుంచి బేస్తవారిపేటలోని రెడ్డినగర్‌కు వచ్చిన వృద్ధులు అవస్థలు పడ్డారు. గిద్దలూరు మండలంలో దుకాణాల వద్ద సుమారు 4 గంటలపాటు వేచి ఉండాల్సి వచ్చింది. రాచర్ల, జేపీ చెరువు గ్రామాలు, పొదిలిచ తర్లుపాడు, మార్కాపురం తదితర ప్రాంతాల్లోనూ సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు పడిగాపులు కాయక తప్పలేదు. కొమరోలు మండలంలోని బెడుసుపల్లె రేషన్ దుకాణం వద్ద కార్డుదారుల కోసం వీఆర్‌ఓ ఎదురుచూడాల్సి వచ్చింది. రెడ్డిచెర్ల గ్రామంలో సర్వర్ పనిచేయకపోవడంతో రేషన్ దుకాణం ఖాళీగా దర్శనమిచ్చింది.



బేస్తవారిపేటలోని రేషన్ దుకాణం వద్ద వేచిఉన్న కార్డుదారులు



తర్లుపాడులో ఉదయం 11 గంటలకు కూడా ప్రారంభం కాని రేషన్‌షాపు



కొమరోలు : బైక్‌పై బియ్యం తీసుకెళ్తున్న గుంతపల్లె యువకుడు ప్రొద్దుటూరి బాషా

అవ్వాతాతలకు అవస్థలు

ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో రేషన్ సరుకుల కోసం ఆదివారం వృద్ధులు నానాఅవస్థలు పడ్డారు.

గిద్దలూరు పట్టణంలోని నరసింహస్వామి మెట్ల వద్ద నివాసం ఉండే తెల్లగొర్ల దేవి అనే వృద్ధురాలు బియ్యం తీసుకెళ్లేందుకు తన మనవరాలు వైష్ణవిని తోడుగా తెచ్చుకుని దుకాణం వద్ద వేచి ఉన్నారు. రేషన్ సరుకుల కోసం గంటల కొద్ది నిలబడే ఓపికలేదని తోటకొండ వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

మండల కేంద్రమైన రాచర్లలో రేషన్ షాపు-14లో వేలిముద్రలు పడకపోవడంతో గంటల తరబడి నిలబడి రేషన్ సరుకులు తీసుకున్నారు. ఈ రేషన్ షాపులో వృద్ధులే బియ్యం సంచులకు ఎత్తుకుని తూకం వేసుకున్నారు.

పొదిలిలోని పాతూరు శివాలయం ప్రాంతంలో నివసిస్తున్న వృద్ధురాలు మూలంరాజు రాజమ్మ చేతి కర్ర ఉంటే తప్ప నడవలేని పరిస్థితి. అయినా దుకాణం దగ్గరకు వచ్చి పడి గాపులు కాసింది.



పొదిలిలో వేచిఉన్న వృద్ధురాలు రాజమ్మ



గిద్దలూరులో రేషన్‌షాపు వద్ద వేచి ఉన్న వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ



గిద్దలూరులో సర్వర్ పనిచేయకపోవడంతో వేచి ఉన్న కార్డుదారులు

రేషన్ షాపులు అందుబాటులో ఉంచాలి



మేము కందులాపురం పంచాయతీలోని తర్లుపాడు రోడ్డులో నివాసం ఉంటాం. మొన్నటి వరకు ఇంటి వద్దకు వచ్చి బియ్యం వేసేవారు. ఇప్పుడేమో రేషన్ షాపులో తెచ్చుకోవాలంటున్నారు. రేషన్ షాపు ఎక్కడ పెట్టారో కూడా మాకు తెలియడం లేదు. మా ఇళ్లకు సమీపంలో ఒక్క రేషన్ షాపు లేదు. ఏ ఏరియా షాపును ఆ ఏరియాలో ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– షేక్ మహబూబ్‌వలి, కంభం

నాకు సరిగా కళ్లు కనిపించవు



రేషన్ సరుకులు ఇంటి వద్దకే తెచ్చిచ్చే పద్ధతి బాగుంది. ఈ నెల నుంచి రేషన్ షాపులో బియ్యం తీసుకోవాలని చెప్పారు. నాకు కళ్లు సరిగా కనిపించవు. అయినా నిదానంగా రేషన్ దుకాణం వద్దకు వచ్చా. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో షాపు వద్దకు ఒక్కదానినే రావాల్సి వచ్చింది.

– పునుగుపాటి అంకమ్మ, బెడుసుపల్లె

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి



ఎండీయూ వాహనం ఇంటి వద్దకు వచ్చినప్పుడు రేషన్ సరుకులు తీసుకునేందుకు అందరికీ అనుకూలంగా ఉంది. ఇప్పుడు పనులు మానుకుని రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవడం, వాటిని నెత్తిన పెట్టుకుని, రిక్షాలు, సైకిళ్లు, బైకులపై తెచ్చుకోవాల్సి రావడం చాలా ఇబ్బందికరం. పాత పద్ధతినే కొనసాగిస్తే బాగుంటుంది.

– నరేష్, మార్కాపురం

ప్రతి నెలా ఇబ్బందే..



కార్డుదారులకు ఇంటి దగ్గరే సరుకులిచ్చే పద్ధతిని నిలిపేయాల్సిన అవసరం ఎందుకొచ్చింది. రేషన్ బండి వీధుల్లోకి వస్తూ సైరన్ మోగిస్తే ఆ సమయంలో ఇంట్లో ఎవరున్నా సరుకులు తీసుకునేవాళ్లం. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని రద్దు చేయడం వల్ల ప్రజలు ప్రతి నెలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఎండీయూ వాహనాల్లో సరుకులు పంపిణీ చేస్తే అందరికీ బాగుంటుంది.

– రెబ్బా సుబ్బారావు, బసవాపురం, మునగపాడు పంచాయతీ

మెరిట్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

పొదిలి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిశాలలో ఆదివారం మెరిట్ విద్యార్థులను ఆవోపా ఆధ్వర్యంలో సన్మానించి బహుమతులు అందజేశారు. 2024-25లో జేఈఈ మెయిన్స్‌లో 646 ర్యాంకు సాధించిన సోమిశెట్టి వెంకట సాయి చక్రి, ఇంటర్మీడియెట్‌లో ఓబులశెట్టి వెంకట లక్ష్మీ శ్రావణి, దేసు లితేష్ గుప్తా, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మునగా సాయి కృష్ణ నిరంజన్, బైపీసీలో కొండా హిందుజా, పదో తరగతిలో ప్రతిభ చాటిన కారంశెట్టి వెంకట ఐశ్వర్య, సింగరీ, మహేశ్ సాయిని సన్మానించి బహుమతులు అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ జీసీ సుబ్బారావు, ఉపాధ్యక్షులు పేర్ల శ్రీనివాసరావు, వేమ కృష్ణమూర్తి, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు దివ్వెల మురళి, ఆవోపా అధ్యక్షుడు దివ్వెల కోటేశ్వరరావు, కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి పైడిమర్రి శ్రీనివాసరావు, మేడా కృష్ణ, భూమా రాంబాబు, లీగల్ అడ్వయిజర్ కొండవీటి రామచంద్రరావు, కొత్తూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణ యజమానులకు జరిమానా

పొదిలి: నగర పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పలు దుకాణాల యజమానులకు ఒకొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. కమిషనర్ కెఎల్.నారాయణరెడ్డి ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, కాలేజీ రోడ్డు, విశ్వనాథపురంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. రోడ్డు పక్కన వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సబ్‌స్టేషన్ రోడ్డులో ఓ గృహానికి సంబంధించిన ఇంకుడు గుంతను రోడ్డు స్థలంలో ఏర్పాటు చేయడంతో జరిమానా విధించి పూడ్పించారు. హోటళ్లను తనిఖీ చేసి సూచనలిచ్చారు.


మలేరియాపై అప్రమత్తంగా ఉండండి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

మార్కాపురం: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఆర్.నాగేంద్రరెడ్డి సూచించారు. మలేరియా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం అరవిందఘోష్ వీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమతెరలు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, సత్యనారాయణరాజు, అబ్దుల్ కరీం తదితరులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. 2000-01 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ప్రస్తుతం వివిధ రంగాల్లో రాణిస్తూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారంతా ఆత్మీయ వేడుకకు హాజరై యోగక్షేమాలు తెలుసుకున్నారు. చదువు చెప్పిన గురువులు జె.కృష్ణమూర్తి, కె.గోపాలకృష్ణమూర్తి, కె.సుబ్రమణ్యం, డి.వెంకటేశ్వరరెడ్డి, గోవిందయ్య, కె.అనివిలాసిని, ఎస్కే యూసఫ్, కోటిమోహన్, ఎ.సుబ్రహ్మణ్యం, వాడెల వెంకటరమణను ఘనంగా సత్కరించారు. తమతో కలిసి చదువుకున్న మాలపాటి వెంకటేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి శ్రీనివాసరెడ్డి, తాడి భూపాలరెడ్డి, రవికుమార్ మరణించారని తెలుసుకుని కలత చెందారు. వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఇకపై ఏటా కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజారామిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేసిన హెచ్‌ఎం సుధాకర్‌ను పూర్వ విద్యార్థులు అభినందించారు.